క్లుప్తంగా

శంకర్‌లింగేశ్వర ఆలయంలో పూజలు



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గుట్టపై గల శంకర్‌లింగేశ్వర దేవాలయంలో సోమవారం బీశ్మారాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే రాజుకుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దేవాలయం వివరాలు కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణార్జున్‌రెడ్డి, నాయకులు రాజుగౌడ్, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బట్టి శ్రీనివాస్, రామ్‌చందర్ పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఊట్కూరు: పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కీ.శే. ఎం లక్ష్మారెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ, 10వ తరగతి 1988 బ్యాచ్ మిత్రబృందం ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులు 250 మందికి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు తిరుపతి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, సంతోష్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహమ్మద్‌రఫీ, జయశ్రీ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలు ప్రారంభం



మక్తల్: అంతర్జాతీయ జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆదేశాల మేరకు సోమవారం మక్తల్ పట్టణంలో విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. విద్యార్థులకు ఖోఖో పోటీలను ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శంకర్‌నాయక్, అంబ్రేస్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగప్ప, పీడీ వెంకటేశ్వర్లు, పీడీ రూప, రిటైర్డు పీఈటీ గోపాలం, రమేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఊట్కూర్: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని పగిడిమారి శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అమీన్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల శివకుమార్, కమ్మరి ఆంజనేయులు నారాయణపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నారాయణపేట నుంచి మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన కిశోర్ కుమార్ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పగిడిమారి గ్రామ శివారులో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో వడ్ల శివకుమార్, కమ్మరి ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని నారాయణపేట ఆస్పత్రికి ప్రైవేట్ వాహనంలో తరలించారు. ఈ విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



దామరగిద్ద: ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు జోషి, నర్సింహులు, మొగులప్ప, నరేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు భీంషప్ప, నర్సింహులు, హన్మంతు, నరేష్, నారాయణ, వెంకటేష్, పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాలలు

- పంచాయతీ భవనాలే దిక్కు
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



చిన్నపోర్లలో మరమ్మతుకు నోచుకోని పశువైద్యశాల భవనం

ఊట్కూర్: ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న రైతులకు వెన్నెముక అయిన పశువైద్యానికి తగినంత ప్రోత్సాహం లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరడంతో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పశువైద్య కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులకు గురువుతున్నారు. మండలంలో చిన్నపొర్ల, ఎడివెల్లి, బిజ్వార్ గ్రామాలలో పశువైద్యశాల భవనాలు రెండు దశాబ్దల క్రితం నిర్మించడంతో అవి శిథిలావస్థకు చేరాయి. చికిత్స నిర్వహించేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిజ్వార్, చిన్నపొర్ల, ఎడివెల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ అదనపు గదుల్లో పశువైద్యశాలలు కొనసాగుతున్నాయి. మక్తల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మాత్యులు వాకిటి శ్రీహరి స్పందించి పశువైద్యశాలల పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎడవెల్లిలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల



బిజ్వార్‌లో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

ఎన్నికల హామీలు అమలు చేయాలి



పల్లెర్ల సీపీఐ జెండావిష్కరిస్తున్న పార్టీ నాయకులు

మద్దూరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఉమ్మడి జిల్లా నేత సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పల్లెర్ల గ్రామంలో సీపీఐ మండల మహాసభ హన్మంతు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో సీపీఐ జెండాను ఆవిష్కరించి, అనంతరం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య వైరుధ్యాలు సృష్టిస్తూ రాజకీయ లబ్దిపొందే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, సంతోష్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, గణేష్, నర్సింహులు, కాశప్ప, అమృతమ్మ, చంద్రప్ప, చెన్నప్ప, అంజమ్మ, వరలక్ష్మి,రాణి పాల్గొన్నారు.

కోస్గి రూరల్: సీపీఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి నర్సింహులు తెలిపారు. పట్టణంలోని శివయ్య మఠంలో మండల మహాసభ నిర్వహించారు. మండల కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా మొహన్‌సింగ్, కార్యవర్గ సభ్యులుగా మహబూబ్‌ఖాన్, సలీం, నర్సింహులు, మునిరొద్దీన్, భాగ్యలక్ష్మి, లాల్‌పాషా, నాగేంద్రప్ప, శ్రీదేవిలను ఎన్నుకున్నారు. పార్టీ సిద్ధాంతాలకు అందరు కట్టుబడి నిబద్ధతతో పని చేయాలని కోరారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

మరికల్: మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర సోమవారం రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు (ఎన్ఎఫ్ఎస్ఎం) పథకం కింద సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి రైతులకు కంది విత్తనాలను అందజేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అందజేసిన కంది విత్తనాలను రైతులు అధికారుల సూచనల మేరకు సాగు చేయాలన్నారు. ఏఈఓ పరశురామ్, సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, రాజు, రామకృష్ణ,నర్సింహులు విజయ్ పాల్గొన్నారు.

మీడియాపై దాడి దుర్మార్గమైన చర్య



నారాయణపేట రూరల్: మీడియాపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని, ప్రభుత్వం తక్షణమే స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ఓ తెలుగు న్యూస్ ఛానల్‌పై జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎస్పీ యోగేష్ గౌతంను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, సంజీవ్ ప్రకాష్, రాజేష్ కుమార్, రఘు గణప, సురేష్, తఖి, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి



పెద్దకడ్మూర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

నర్వ: సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి గూంజ్ సంస్థ కృషి చేస్తున్నట్లు కుమార్ లింగంపల్లి పీఎస్ హెచ్ఎం సూరం వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్ గూంజ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులైన తన మిత్రుడి సహకారంతో సోమవారం విద్యార్థులకు బ్యాగులు, కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.50 వేల విలువైన బ్యాగులు, నోట్‌బుక్కులు, పెన్సిల్స్, పెన్నులు, క్రేయాన్స్, స్కెచ్‌పెన్స్, ఆక్టివిటీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల వ్యవసాయ అధికారి రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. హెచ్ఎం చెన్నకేశవరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఆశన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉసేనప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ నిజాముద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సమయపాలన, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

నర్వ: విద్యార్థులకు విద్యాశాఖ సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం పెద్దకడ్మూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టి మొదటి సారి పాఠశాలకు వచ్చిన ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని, ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నోట్‌బుక్కులు అందించాలన్నారు. సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేటట్లు బోధన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మణెమ్మ, ఉపాధ్యాయులు రమేష్‌గౌడ్, అనిల్, మాధవి, ముబీన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



అనితతో చిన్నారి అక్షిత (ఫైల్)

కోస్గి రూరల్: వికారాబాద్ జిల్లా దుద్యాల గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. కోస్గికి చెందిన అనిత, వెంకటేష్ దంపతులతో పాటు వారి మూడేళ్ల కుమార్తె అక్షిత ఈ నెల 25న స్కూటీపై కొడంగల్‌కు బయలుదేరారు. తాండూర్ నుంచి సిమెంట్ లోడ్‌తో మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న లారీ దుద్యాల్ గేట్ సమీపంలో స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్షిత అక్కడికక్కడే మృతిచెందగా క్షతగాత్రులను వెంటనే కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిత (24) సోమవారం మృతి చెందింది. వారం వ్యవధిలోనే తల్లికూతుళ్లు మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ప్లాస్టిక్‌ను తగ్గించి బట్ట సంచులను వాడాలి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ అనిల్‌కుమార్

కోస్గి: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులు వాడాలని, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా వివేకానంద చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పలు వ్యాపార సముదాయాల నూతన ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, రెన్యూవల్ చేశారు. ప్లాస్టిక్ వాడితే చట్టరీత్యా చర్యలు, జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మొహిన్ బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

హక్కులపై అవగాహన



మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సివిల్ రైటర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రతినెల చివరి రోజున గ్రామాల్లో ప్రజలకు, గ్రామ పెద్దలకు, యువకులకు, విద్యార్థులకు హక్కులను వివరించారు. సమాజంలో కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ సమానంగా జీవించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఎంఆర్ఐ బలరాజు, ఏఎస్ఐ మన్నన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భజరంగ్ దళ్ నూతన కమిటీ

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్‌లో సోమవారం బజరంగ్ దళ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ ఆధ్వర్యంలో గ్రామ హైందవ సోదరులు ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సంయోజక్‌గా సురేష్, సహా సంయోజక్ గా నరేష్, తిమ్మప్పలు ఎన్నికయ్యారు. అదేవిధంగా గో సంరక్ష‌క్‌గా నరేష్, అయ్యప్ప, బాలు, విద్యార్థి ప్రముక్ గా మహేష్, వెంకటేష్, అఖద్ ప్రముక్ గా శ్రీకాంత్, రాజేష్, సప్తహిక్ ప్రముక్ గా అనిల్, శ్రీను, ఆకాష్, సురక్ష ప్రముక్ గా నరసింహ, అనిల్, ప్రచార ప్రముక్ గా పవన్, లక్ష్మణ్, కార్తీక్ లను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కన్న శివకుమార్, మురళి బట్టడ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కర్నిలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మరికల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మాధవరంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయించిన ఆయనను లబ్ధిదారులు శాలువాతో సన్మానించారు.

మాగనూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని ఓబ్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్, హౌసింగ్ ఏఈ ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కర్ని, పంచదేవ్‌పాడులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్, రాఘవేందర్, రహిపాత్‌పాష, దత్తు పాల్గొన్నారు.

కృష్ణా: గ్రామాల్లోని పేదలకు ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని కాంగ్రెస్ మండల నాయకుడు శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని హిందుపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అంజప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

తాను చదివిన పాఠశాలలో పిల్లలను చేర్పించి..

- ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన నల్లె శివరాజ్
- అభినందించిన ఎంఈఓ



తాను చదివిన పాఠశాలలో కొడుకు, కూతురిని చేర్పించిన ఉపాధ్యాయుడు నల్లె శివరాజ్

కృష్ణా: తమ స్వగ్రామంలో తాను చదివిన పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, తన పిల్లలను కూడా అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం చాలా అరుదు. సమాజంలో ఇలాంటి వారు నూటికో కోటికో ఒక్కరు ఉంటారు. ఆలాంటిదే నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని కున్సీ గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. కున్సీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న నల్లె శివరాజ్ తన కూతురు భవ్యశ్రీ, కొడుకు తరుణ్‌లను చేర్పించి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచి వృత్తికే గౌరవం తెచ్చాడు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉద్యోగం సంపాదించాడు. తన పిల్లలు కూడా అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని కాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. కున్సీ ప్రాథమిక పాఠశాలకు గత సంవత్సరం ఉద్యోగ రిత్యా రావడం జరిగింది. పాఠశాలలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తున్నాడు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 215కు చేరడంతో పాటు ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రిని సమకూర్చారు. 150 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ ఇప్పించడం, తదితర కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ నిజాముద్దీన్ కున్సీ పాఠశాలకు సందర్శించి ఉపాధ్యాయుడు నల్లె శివరాజ్‌ను అభినందించారు. ప్రస్తుత సమాజానికి ఇలాంటి ఉపాధ్యాయులు ఉండడం అత్యవసరమని ఎంఈఓ తెలిపారు. ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరిస్తే విద్య ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆస్పత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలి



వైద్యాధికారిణికి సమ్మె నోటీసులు ఇస్తున్న ఆస్పత్రి కార్మికులు

మద్దూరు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్‌టేకర్, తదితర కార్మికుల వేతనాలు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం సీహెచ్‌సీ ఎదుట కార్మికులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జిల్లా, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు జనవరి నుంచి వేతన బడ్జెట్ విడుదల కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మె నోటీసును వైద్యాధికారి పావనికి అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు మహేష్, చాంద్‌పాషా, రవికుమార్, రాజేష్, లలిత, భాగ్యమ్మ, కృష్ణవేణి, షాకినాబేగం, రేణుక, రవి, నవీన్, సావిత్రమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మద్దూరు: రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో కొడంగల్ బీజేపీ ఇన్‌చార్జి రమేష్, మండలాధ్యక్షుడు శంకర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భరత్, రాఘవేందర్, వెంకటయ్య, శ్రీనివాస్, బాలకృష్ణ, నరేష్, ఆనంద్ పాల్గొన్నారు.

యాదవులంతా ఒక్కటవుదాం



కొత్తపల్లి: ఆల్ ఇండియా యాదవ హక్కుల పోరాట సమితి నారాయణపేట జిల్లా అధ్యక్షుడు హన్మంతు యాదవ్, మండల కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్ సమక్షంలో మండలంలోని దుప్పడి గట్టులో కుల సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశవులు, లింగప్ప, మల్లేశ్ యాదవ్, శ్రీను యాదవ్, అమృత్ యాదవ్, మోహన్, దస్తప్ప పాలొన్నారు.

తడిపొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి



మద్దూరు: మద్దూరు పుర ప్రజలు చెత్త సేకరణకు వచ్చే పుర సిబ్బందికి తడిపొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని పుర కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. మద్దూరు పట్టణంలో ఎస్సీ కాలనీలో ప్రజలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేశారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రోసైడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌లో సమయపాలన పాటించాలి

కోస్గి రూరల్: భూ సంబంధిత రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్‌లో సమయ పాలన పాటించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారి 8 స్లాట్ బుకింగ్స్‌తో పాటు భూ భారతి ఫిర్యాదులు, నూతన రేషన్‌కార్డులు, పేర్ల తొలగింపు, కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాలు మొదలైనవి కచ్చితంగా చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3-00 గంటల నుంచి 4-45 గంటల వరకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సమయాన్ని పాటించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో ఎల్లమ్మ దేవత ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆలయ అర్చకుడు శరణప్ప, కాంగ్రెస్ మండల నాయకుడు నాగేంద్రం తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నిధులను వివిధ పట్టణాల్లోని తమ గ్రామానికి చెందిన భక్తుల నుంచి అఖిలపక్షం ఆధ్వర్యంలో సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ యువ నాయకుడు మ్యాకలి సురేష్ పాల్గొన్నారు.